సాక్షి
ప్రకాశం
ఆదివారం । 7 । మే । 2023



కార్పొరేట్ విద్య ఉచితం

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆమేరకు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. - 8లో..



ప్రతి రైతుకు నష్టపరిహారం

పంట నష్టపోయిన రైతులందరినీ ఆదుకునేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు పంట నష్టం పరిశీలన జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణబాబు తెలిపారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34 /27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాలినేనిని కలిసిన కలెక్టర్ దినేష్‌కుమార్



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో మాట్లాడుతున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు

ఒంగోలు అర్బన్: స్థానిక ఎన్‌ఎస్‌పీ అతిథి గృహంలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న జగనన్న గృహ నిర్మాణాలపై చర్చించారు. జగనన్న కాలనీలు, గృహ నిర్మాణాల తదుపరి కార్యాచరణపై చర్చించారు. దీంతో పాటు నియోజకవర్గంలోని సమస్యలు, అభివృద్ధి పనులపై మాట్లాడారు.

ప్రభుత్వ పింఛనుదారులు ఈ-కేవైసీ చేసుకోవాలి

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పింఛనుదారులు అందరూ ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఏ.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ-కేవైసీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. అందులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పింఛనుదారులు అందరూ మే నెల 10వ తేదీలోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఎవరికి వారు వ్యక్తిగతంగానే ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా మీ పరిధిలోని ఉప ఖజానా కార్యాలయానికి వెళ్లి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

పలువురు డీఎస్పీల బదిలీ



నారాయణస్వామి రెడ్డి



టి.అశోక్ వర్ధన్

ఒంగోలు టౌన్: రాష్ట్ర స్థాయి బదిలీల్లో భాగంగా జిల్లాలోని పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దర్శిలో విధులు నిర్వహిస్తున్న వి.నారాయణ స్వామి రెడ్డిని ఒంగోలుకు బదిలీ చేశారు. ఒంగోలు సబ్‌డివిజన్ నుంచి టి.అశోక్ వర్ధన్ రెడ్డిని దర్శికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న సీహెచ్.శ్రీనివాస రావును ఒంగోలు దిశ పోలీస్ స్టేషన్‌కు, వెయిటింగ్‌లో ఉన్న జె.శ్రీనివాసులును ఒంగోలు పోలీసు ట్రయినింగ్ స్కూల్‌కు బదిలీ చేశారు. మార్కాపురం డీఎస్పీ ఎం.కిశోర్ కుమార్‌ను రాజమండ్రి ఈస్ట్‌కు, వెయిటింగ్‌లో ఉన్న ఆర్.రామరాజును కనిగిరికి, యు.నాగరాజును మచిలీపట్నం దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. సంబంధిత పోలీసు స్టేషన్లలో వెంటనే రిపోర్టు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

ప్రైవేటు జూనియర్ కాలేజీలను పరిశీలించాలి

ఒంగోలు అర్బన్: ప్రైవేటు జూనియర్ కాలేజీల అఫిలియేషన్ పునరుద్ధరించేందుకు జీవోఎంఎస్ నంబర్ 192 ప్రకారం కాలేజీల్లోని సదుపాయాలను ఈ నెల 20వ తేదీలోపు పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ప్రకాశం భవనంలో జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కాలేజీల అఫిలియేషన్ పునరుద్ధరణ కోసం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. 2023–24 విద్యా సంవత్సరానికి కాలేజీలకు అఫిలియేషన్ పునరుద్ధరణ కోసం కాలేజీల్లో అగ్నిమాపక, పారిశుద్ధ్యం సదుపాయాలు, సౌండ్‌నెస్ సర్టిఫికెట్, ఎన్‌ఓసీ ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. దీనిలో ఆర్ఐఓ సైమన్ విక్టర్, డీఎల్‌పీఓ పద్మ, అగ్నిమాపక అధికారి వేణుగోపాల్, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు భళా

- పది పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిన బాలికలు
- 73.74%తో 12వ స్థానంలో జిల్లా
- జిల్లాలో అత్యధికంగా దర్శి విద్యార్థికి 597 మార్కులు
- 13వ తేదీలోగా రీకౌంటింగ్/ రీవెరిఫికేషన్ దరఖాస్తుకు అవకాశం
- అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి
- 76.99% మందికి ప్రథమస్థానం
- గత ఏడాది 78.30 శాతంతో రాష్ట్రంలోనే ప్రకాశం ప్రథమ స్థానం

ఒంగోలు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మరోమారు బాలికలు భళా అనిపించారు. బాలుర కంటే 3.32 శాతం మంది విద్యార్థినులు అధికంగా ఉత్తీర్ణులై సత్తా చాటారు. శనివారం రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యన్నారాయణ విజయవాడలో పది ఫలితాలు విడుదల చేశారు. గత ఏడాది ఉమ్మడి జిల్లాల వారీగా పరీక్షలు నిర్వహించగా 78.30 శాతంతో ప్రకాశం జిల్లా అప్పట్లో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. ఈ ఏడాది విభజన జిల్లాల వారీగా పరీక్షలు నిర్వహించగా ప్రకాశం జిల్లా 12వ స్థానంతో సరిపెట్టుకుంది.

రాష్ట్రస్థాయిలో ఫలితాలతో పోలిస్తే తెలుగు మీడియం విద్యార్థులు 50 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించగా, ఆంగ్ల మాధ్యమం విద్యార్థులు 80.82 శాతం ఉత్తీర్ణులవడం గమనార్హం.

జిల్లాలో 14,830 మంది బాలురు, 14,072 మంది బాలికలు పరీక్షకు హాజరయ్యేందుకు ఫీజులు చెల్లించారు. బాలురు 72.12 శాతం, బాలికలు 75.44 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 582 పాఠశాలల నుంచి విద్యార్థులకు పరీక్షలకు హాజరుకాగా వారికి 175 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు, 19 నుంచి 26వ తేదీ వరకు మూల్యాంకనం నిర్వహించి 10 రోజుల్లోనే విద్యాశాఖ ఫలితాలను విడుదల చేశారు.

యాజమాన్యం	పాఠశాలల సంఖ్య	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణత	ఉత్తీర్ణత శాతం
ఎయిడెడ్ పాఠశాలలు	21	537	318	59.22
బీసీ వెల్ఫేర్	4	161	143	88.82
ప్రభుత్వ పాఠశాలలు	20	2154	1198	55.62
ఆశ్రమ పాఠశాలలు	4	64	13	20.31
కేజీబీవీ పాఠశాలలు	28	1013	700	69.10
మున్సిపల్ పాఠశాలలు	7	606	335	55.28
ఏపీ మోడల్ స్కూల్స్	6	521	417	80.04
ప్రైవేటు పాఠశాలలు	230	10108	9100	90.03
ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు	3	216	215	99.54
సోషల్ వెల్ఫేర్	11	809	664	82.08
ట్రైబల్ వెల్ఫేర్	9	261	146	55.94
జిల్లా పరిషత్	239	12452	7928	63.66
మొత్తం	582	28,902	21177	73.27

35 పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత

జిల్లాలోని 38 మండలాల్లో 18 మండలాల్లో 75 శాతానికిపైగా ఉత్తీర్ణత లభించింది. యాజమాన్యం వారీగా పరిశీలిస్తే 26 ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలు, 3 జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 2 ఏపీ రెసిడెన్షియల్, 2 ఏపీ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల, ఒక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ఉన్నాయి. హనుమంతునిపాడు మండలం అత్యధికంగా 92.16 శాతం ఉత్తీర్ణత సాధించగా, పొన్నలూరు మండలం అత్యల్పంగా 50.14 శాతం సాధించారు. 35 పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. వాటిలో అమ్మనబ్రోలు ఏపీ రెసిడెన్షియల్, సంతనూతలపాడు ఏపీ రెసిడెన్షియల్(బాలురు), అమెరికన్ పబ్లిక్ స్కూల్ (బొద్దికూరపాడు), ఏపీ సోషల్ వెల్ఫేర్ బాలికలు (కొండపి), బ్రదర్ హైస్కూల్ (కనిగిరి), జెమ్స్‌హైస్కూలు (ఒంగోలు), గోమతి హైస్కూలు (కనిగిరి), ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల (పొన్నలూరు), గౌతం హైస్కూలు భాగ్యనగర్ (ఒంగోలు), హనుమంతరావు హైస్కూలు (గంగవరం), కేజీబీవీ (మోటుమాల), కృష్ణా మెమోరియల్ (ఒంగోలు), మహాత్మాజ్యోతిరావుపూలే ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (టంగుటూరు), మదర్ కేర్ ఇంగ్లిష్ మీడియం(పామూరు), నారాయణ ఇంగ్లిష్ మీడియం (ఒంగోలు లాయరుపేట), ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూలు (అన్నవరప్పాడు ఒంగోలు), ఆక్స్‌ఫర్డ్ (ఉప్పుగుండూరు), ఆర్ఆర్ హైస్కూలు (గిద్దలూరు), రెయిన్‌బో హైస్కూలు (వై.పాలెం), రవీంద్ర భారతి(ఒంగోలు), సంస్కృతి విద్యాలయం (దర్శి), శాంతినికేతన్ (కొండపి), సెర్వితే (కొమరోలు), శ్రీచైతన్య (ఒంగోలు భాగ్యనగర్), శ్రీచైతన్య (బోడపాడు), శ్రీచైతన్య (కాగితాలగూడెం), శ్రీజాహ్నవి (తూర్పు గంగవరం), శ్రీ మహర్షి (పొదిలి), శ్రీసాయి వీఎస్ (అమ్మనబ్రోలు), శ్రీవివేకానంద (దొనకొండ), సెయింట్ ఆన్స్ (మార్కాపురం), విజేత (ఒంగోలు మారుతీనగర్), చిన్నం ఉప్పలపాడు జెడ్పీహైస్కూలు, నేరేడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, పెదగొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉన్నాయి.



మొత్తం విద్యార్థులు : 28,902

ఉత్తీర్ణులైనవారు	: 21,177 (73.74%)
ప్రథమ శ్రేణి	: 16,305 (76.99%)
ద్వితీయ శ్రేణి	: 3,544 (16.73%)
తృతీయ శ్రేణి	: 1,328 (6.28%)

20 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు: 11

సున్నా కంటే ఎక్కువ , 20 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలులో జిల్లాలో 11 ఉన్నాయి. ఏబీఎం జూనియర్ కాలేజీ (ఒంగోలు), ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలు(వై.పాలెం), గారపెంట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, అంబవరం కవిత ఉన్నత పాఠశాల, కంభం శ్రీభ్రమరాంబ ఉన్నత పాఠశాల, గిద్దలూరు సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల, గిద్దలూరు సెయింట్ పాల్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల (తెలుగు మాధ్యమం), పాపినేనిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, బోగోలు జెడ్పీ ఉన్నత పాఠశాల, పాత సింగరాయకొండ జెడ్పీ ఉన్నతపాఠశాల, వై.చెర్లోపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, అత్యల్పంగా ఒంగోలు ఏబీయం జూనియర్ కాలేజీ నుంచి 20 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఒక్కరు మాత్రమే ఉత్తీర్ణత (4.76 శాతం) సాధించారు.

100 శాతం వైఫల్యం చెందిన పాఠశాలలు : 3

చింతల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, మార్కాపురం న్యూ మోడల్ ఉన్నత పాఠశాల, ఒంగోలు క్లౌపేట యూసీఎల్ఐ ఉన్నత పాఠశాలలు నూరు శాతం ఫెయిల్ అయ్యారు.

అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి

పదో తరగతి అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఇక రీ కౌంటింగ్ లేదా రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. వారు విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని రీకౌంటింగ్‌కు రూ.500లు, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 ఒక్కో సబ్జక్టుకు సీఎఫ్‌ఎంఎస్ చలానా చెల్లించాలి. చలానా, దరఖాస్తు, హెడ్ మాస్టర్ ధ్రువీకరించిన హాల్ టికెట్ నకలు కాపీని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో సమర్పించాలి. రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసిన సబ్జక్టు మార్కులను మరోమారు గణిస్తారు. రీ వెరిఫికేషన్‌లో మార్కులను గణించడం, అన్ని ప్రశ్నలకు సంబంధించి జవాబుల మూల్యాంకనం జరిగిందా లేదా, ఏవైనా మూల్యాంకనం చేయకుండా ఉండి ఉంటే వాటిని మూల్యాంకనం చేస్తారు. అంతే తప్ప మూల్యాంకనం చేసిన సమాధానాలను మళ్లీ మూల్యాంకనం చేయరు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి

ఒంగోలు సబర్బన్: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలోని 5వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ నగర్ ఒకటో వార్డు సచివాలయం పరిధిలోని గోపాల్ నగర్ రెండో లైన్ ఎక్స్‌టెన్షన్ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోపాల్‌నగర్‌లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా బాలినేని అడిగి తెలుసుకున్నారు. ఒంగోలు నగరంతో పాటు నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించటమే లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజల ఇబ్బందులు ఏవైనా ఉంటే తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా చేసుకొని పాలన సాగిస్తుందని వెల్లడించారు. ఒంగోలు నగరంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అందుకే ధైర్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తున్నామన్నారు. గోపాల్ నగర్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇప్పటికే ఒంగోలు నగరంలో 14 డివిజన్లు పర్యటించామని, ప్రస్తుతం 5వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతూ మహిళలతో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజనీ, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, ఫణిదపు సుధాకర్, పీవీ నాయుడు, మహిళా విభాగం జిల్లా పార్టీ అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, ఈదర సురేష్ బాబు, యనమల నాగరాజు, తాడి కృష్ణలత, ట్రేడ్ యూనియన్ నాయకులు పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, బొమ్మినేని మురళి, 5వ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్.సత్య నారాయణ రెడ్డి, జమ్ము శ్రీకాంత్, తాళ్ళపాలెం శ్రీను, వాకా తిరుమల, పి.మోహన్ రావు, బొట్ల సుబ్బారావు, ఆసోది విజయలక్ష్మి, విక్కీ వెంకటేశ్వర్లు, ఎస్‌కే.ఖుద్దూస్, రామిశెట్టి హరి, ఆవుల సురేంద్ర, గొల్లపోలు కృష్ణ, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కఠారి సురేష్, మిరియం సుబ్బులు, గఫూర్, మూసుబ్ పాల్గొన్నారు.

ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా పనిచేయండి

- 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి
- వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ కార్యాలయాల్లో సమస్యలు పరిష్కరించడంలో ప్రజలకు మరింత నమ్మకంతో పాటు సంతృప్తి స్థాయి పెరిగేలా పనిచేయాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక అధికారిగా శనివారం జిల్లాకు వచ్చిన ఆయన కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులతో కలిసి ప్రకాశం భవనంలో వివిధ కార్యక్రమాలు జిల్లాలో అమలవుతున్న తీరుపై సమావేశం నిర్వహించారు. దీనిలో కృష్ణబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల మరింత శ్రద్ధతో మెరుగైన, ఖచ్చితమైన పరిష్కారాలు చూపాలన్నారు. ఆ ధ్యేయంగానే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్వహించాలన్నారు. పరిష్కారం చేయలేని సమస్యలుంటే అర్జీదారులను పిలిచి వారికి వివరించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణల్లో పురోగతి ఉండాలన్నారు. ఆరోగ్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ఆర్‌బీకేలు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, సచివాలయాలు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. నాడు–నేడు, రీ సర్వే తదితర అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. దీనిలో డీఆర్ఓ ఆర్ శ్రీలత, సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరెడ్డి, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, డీఈఓ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ హౌసింగ్ పీడీ పేరయ్య, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, బీసీ సంక్షేమ అధికారి అంజల, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎంటి.కృష్ణబాబు, కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలి:
మెరుగైన వైద్య సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని ప్రభుత్వ లక్ష్యాల మేరకు వైద్యారోగ్య శాఖ పనిచేయాలని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక మంగమూరు రోడ్డులోని పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ని ఆయన తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో ఔషధాల లభ్యత, వైద్య పరీక్షలను పరిశీలించారు. సిబ్బంది భర్తీపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్ ఇతర అధికారులు ఉన్నారు.

విధి నిర్వహణతోపాటు సామాజిక బాధ్యతను స్వీకరించాలి

- ప్రకాశం జిల్లా పోర్టుఫోలియో జడ్జి కె.మన్మథరావు

ఒంగోలు: న్యాయవాదులు విధి నిర్వహణతోపాటు సామాజిక బాధ్యతను కూడా స్వీకరించాలని ప్రకాశం జిల్లా పోర్టుఫోలియో జడ్జి కె.మన్మథరావు విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి జిల్లా కోర్టు భవనాల సముదాయం ఆవరణలో నిర్వహించిన ఒంగోలు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 30 ఏళ్లపాటు న్యాయవాదిగా పనిచేశానని, గత ఏడాదిన్నర కాలంగా న్యాయమూర్తిగా పనిచేస్తున్నానన్నారు. నూతన కార్యవర్గం తప్పనిసరిగా త్వరలోనే ఒంగోలు కోర్టు భవనాల సముదాయంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సీనియర్లు, జూనియర్ల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలన్నారు. నెగెటివ్‌గా ఆలోచించడం కంటే పాజిటివ్‌గా ఆలోచించడం పెంచుకోవాలని సూచించారు. కేసు స్పీడుగా జరిగేందుకు న్యాయమూర్తికి న్యాయవాదుల నుంచి సహకారం అవసరమని గుర్తించాలన్నారు. న్యాయవాది వృత్తిలో ఉండేవారికి సహనం ముఖ్యమన్నారు. తణుకులో ఒక 80 సంవత్సరాల మహిళా న్యాయవాది 150 మందిని చేరదీసి వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికి కూడా ఒకవైపు ప్రాక్టీస్ చేయడమే కాకుండా ఆమె వద్ద జూనియర్లుగా పనిచేసిన 60 మంది వృద్ధాశ్రమ నిర్వహణ లో పాలుపంచుకుంటుండడం తనను సంతోషాన్ని కలిగించిందన్నారు. అటువంటి కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరాన్ని న్యాయవాదులు ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి, ఏపీ హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి కె.మన్మథరావును బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనకొండ శ్రీనివాసరావు తదుపరి బార్ అసోసియేషన్ అధ్యక్ష బాధ్యతలను నల్లూరి సత్యశ్రీనివాస్‌కు అప్పగించారు. కార్యక్రమానికి ముందుగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



మాట్లాడుతున్న జడ్జి మన్మథరావు

కార్పొరేట్ విద్య ఉచితం..!

- పేద విద్యార్థులకు అవకాశం
- ప్రతి కార్పొరేట్ స్కూల్లో 25 శాతం సీట్ల కేటాయింపు
- ఈ నెల 15లోపు దరఖాస్తులు
- జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన
- ఇప్పటికే రెండు దశల్లో 193 మందికి సీట్ల కేటాయింపు
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై సర్వత్రా హర్షం



మార్కాపురం: విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు సైతం ఉచితంగా కార్పొరేట్ విద్య అందించేందుకు శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించేందుకు చర్యలు చేపట్టింది. ఫలితంగా కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులు ఉచితంగా విద్యనభ్యసించనున్నారు. ఇప్పటికే నాడు–నేడు కార్యక్రమాల ద్వారా సర్కార్ పాఠశాలల రూపురేఖలను రాష్ట్ర ప్రభుత్వం మార్చివేసింది. గడిచిన నాలుగేళ్లలో కార్పొరేట్ స్కూళ్ల కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలు తయారయ్యాయి. దీంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలోనూ 1వ తరగతి ప్రవేశాల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేవలం నామమాత్రపు ఫీజు వసూలు చేయాలని ఆదేశించింది. ఆయా పాఠశాలల్లో చేరిన విద్యార్థుల ఫీజును కూడా అమ్మ ఒడి పథకం ద్వారా ప్రభుత్వమే చెల్లించనుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 2 విడతల్లో ప్రవేశాల ప్రక్రియ కూడా పూర్తయింది. 25 శాతం సీట్లలో 10 శాతం ఎస్సీ విద్యార్థులకు, 6 శాతం బలహీనవర్గాలకు, 4 శాతం ఎస్టీలకు, 5 శాతం దివ్యాంగ విద్యార్థులకు కేటాయించారు. బలహీనవర్గాల జాబితాలో బీసీలు, మైనార్టీలు, ఓసీలు ఉన్నారు. ఓసీల్లో ఏడాదికి పల్లెలో రూ.1.20 లక్షల్లోపు, పట్టణాల్లో రూ.1.44 లక్షల్లోపు కుటుంబ ఆదాయం ఉన్నవారికి మాత్రమే సీట్లు కేటాయిస్తారు. విద్యార్థులు ఉంటున్న ప్రాంతానికి కిలోమీటర్ దూరంలోనే కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

ఫేజ్ – 2లో 42 మంది విద్యార్థులకు ప్రవేశాలు...

జిల్లా వ్యాప్తంగా 36 మండలాల నుంచి 514 మంది విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోగా, ఫస్ట్ ఫేజ్‌లో 151 మంది విద్యార్థులకు అవకాశం కల్పించగా, రెండో ఫేజ్‌లో 42 మంది విద్యార్థుల ప్రవేశాలను ఖరారు చేశారు. అందులో అత్యధికంగా ఒంగోలులో 149 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 60 మందికి అవకాశం కల్పించారు. మార్కాపురంలో 55 మందికిగానూ 18 మందికి ప్రవేశాలు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు.

జిల్లాలోని మండలాల వారీగా మొదటి ఫేజ్‌లో ప్రవేశాలు...

మండలం	సీట్ల కేటాయింపు
బేస్తవారిపేట	3
సీఎస్ పురం	1
చీమకుర్తి	2
కంభం	6
దర్శి	12
గిద్దలూరు	4
కనిగిరి	1
కొండపి	1
కొత్తపట్నం	6
కురిచేడు	2
మద్దిపాడు	2
మార్కాపురం	18
నాగులుప్పలపాడు	2
ఒంగోలు	60
పెద్దదోర్నాల	2
పామూరు	1
పొదిలి	3
పుల్లలచెరువు	1
సంతనూతలపాడు	5
సింగరాయకొండ	6
టంగుటూరు	4
తర్లుపాడు	1
త్రిపురాంతకం	1
యర్రగొండపాలెం	7

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లలో ఉచితంగా సీట్లు కేటాయించింది. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు ఉపయోగించుకోవాలి. మొదటి, రెండు దశల్లో 193 మందికి అవకాశం కల్పిస్తున్నాం.

– పి.రమేష్, డీఈవో, ఒంగోలు

దరఖాస్తు చేసుకోవడం ఇలా



తల్లిదండ్రుల ఆధార్ కార్డ్ లేదా రేషన్ కార్డు, ఓటర్ కార్డుల్లో ఏదో ఒకటి తీసుకుని పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం (ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలి)తో గ్రామ సచివాలయం లేదా ఎంఈవో కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 15లోపు దరఖాస్తులు అందించాలి. విద్యా హక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం సీట్లు పేదలకు కేటాయించారు.

– రాందాస్ నాయక్, ఎంఈవో

క్లుప్తంగా

ఉద్యానవన పంటల్లో జాగ్రత్తలు పాటించాలి

- అకాల వర్షాలకు రైతులు అప్రమత్తం కావాలి
- ఏపీఎంఐపీ, ఉద్యానవనశాఖ అధికారులతో సమీక్షించిన ఏపీఎంఐపీ రాష్ట్ర అధికారి హరినాథరెడ్డి



సమీక్షిస్తున్న ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ హరినాథరెడ్డి, పక్కన పీడీ, ఏడీలు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు ఉద్యానవన పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎంఐపీ రాష్ట్ర అధికారి డాక్టర్ సీబీ హరినాథరెడ్డి సూచించారు. శనివారం ఒంగోలు వచ్చిన ఆయన.. అకాల వర్షాలకు జిల్లాలోని ఉద్యానవన పంటల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై సమీక్ష నిర్వహించారు. స్థానిక ఏపీఎంఐపీ కార్యాలయంలో జిల్లా పీడీ బి.రవీంద్రబాబు, ఉద్యానవనశాఖ జిల్లా ఏడీ వై.గోపీచంద్‌తో పాటు అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా అకాల వర్షాలకు ఉద్యానవన పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. అధిక వర్షాల నేపథ్యంలో పంటల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. మిరప పంటలో కోత అనంతరం కల్లాల్లో ఆరబెట్టిన మిరపకాయలను అధిక వర్షాల నుంచి కాపాడుకోవడానికి సిల్పాలిన్ పట్టలు కప్పాలని సూచించారు. వర్షం కురిసిన వెంటనే నీటిని బయటకు పంపి వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టి ఎగదోయాలని సూచించారు. 2022–23 ఏపీఎంఐపీ ప్రోగ్రాం అమలుకు సంబంధించి ఎంఐ కంపెనీల డీసీవోలు, ఏపీఎంఐపీ సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్షించారు. 2023 జూన్ ముగిసేలోపు మెటీరియల్ సరఫరా, ఇన్‌స్టాలేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

- జూన్ 6న ప్రవేశ పరీక్ష
- దరఖాస్తుకు చివరి తేదీ ఈ నెల 25
- డీఈవో పి.రమేష్

ఒంగోలు: జిల్లాలోని 6 ఆదర్శ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దోర్నాల మండలం మల్లికార్జునపురం, మార్కాపురం మండలం మిట్టమీదపల్లి, రాచర్ల, కనిగిరి, దర్శి మండలం శాంతినగర్, ముండ్లమూరు ఆదర్శ పాఠశాలల్లో సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు.

అర్హత:

ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2021–22, 2022–23 విద్యా సంవత్సరాలలో చదివి ఉండాలి. 2022–23లో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్‌కు అర్హత పొంది ఉండాలి.

దరఖాస్తు చేసే విధానం...

ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 25వ తేదీ వరకు నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డులు ఉపయోగించి పేమెంట్ గేట్‌వే ద్వారా పరీక్ష రుసుం చెల్లించాలి. ఆ తరువాత వారికి ఒక జనరల్ నంబర్ కేటాయిస్తారు. ఆ నంబర్ ఆధారంగా ఏదైనా ఇంటర్నెట్ కేంద్రంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసే ముందు వివరాలతో కూడిన సమాచార పత్రంపై అవగాహన పొందాలి. ఆ తర్వాతే దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీలు ప్రవేశ పరీక్షకు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ఫీజు చెల్లించాలి. ఓసీ, బీసీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 30 మార్కులు సాధించాలి. ప్రతిభ, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్ల భర్తీ ఉంటుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం పూర్తిగా ఆబ్జెక్టివ్ టైపులో ఉంటుంది. ప్రవేశ పరీక్ష జూన్ 11వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. పరీక్షను ఆంగ్ల, తెలుగు మాధ్యమాలలో నిర్వహిస్తారు. ప్రవేశం పొందిన తర్వాత విద్యార్థి వద్ద నుంచి ఎటువంటి ఫీజు వసూలు చేయరు. పూర్తి వివరాలకు సమీపంలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని డీఈవో పి.రమేష్ సూచించారు.

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి

రాచర్ల: విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతిచెందిన సంఘటన మండలంలోని ఆకవీడు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని సాదు రంగనాయకులుకు సంబంధించిన పొలంలో ఉన్న త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గ్రామానికి చెందిన సూర రామకృష్ణారెడ్డి, కడియం రమణకు చెందిన ఈ గేదెల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని రైతులు తెలిపారు.

ప్రతి రైతుకు నష్టపరిహారం

- పంట నష్టపోయిన రైతులందరినీ ఆదుకోవాలని సీఎం ఆదేశించారు
- పంట ఉత్పత్తులన్నింటికీ మద్దతు ధర
- ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంటల కొనుగోలు
- పంటలను పరిశీలించిన ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, కలెక్టర్ దినేష్‌కుమార్



దెబ్బతిన్న నూగు పంటను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, కలెక్టర్ దినేష్‌కుమార్



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణబాబు

తాళ్లూరు: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవడమే ధ్యేయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పంట నష్టం పరిశీలన జిల్లా ప్రత్యేక అధికారి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. తాళ్లూరు మండలంలోని నాగంబొట్లపాలెం, తూర్పుగంగవరం పొలాల్లో అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎన్‌బీ పాలెం ఆర్‌బీకేలో సర్పంచ్ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన రైతుల సమావేశంలో కృష్ణబాబు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అందులో భాగంగానే తాను క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. నువ్వులు, పత్తి, బత్తాయి, అరటి, జామతోటలు దెబ్బతినడాన్ని గమనించామన్నారు. అదే విధంగా రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంట కొనుగోలు చేసి ఆదుకునేలా సీఎం ఆదేశాలు ఇచ్చారని కృష్ణబాబు వివరించారు. పంట నష్టంపై ప్రభుత్వం నుంచి పూర్తి నివేదిక వచ్చిన తర్వాత మార్గదర్శకాల ప్రకారం రైతులను ఆదుకుంటారని చెప్పారు. రైతులు అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన...

తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 105 రకాల మందులు అందుబాటులో ఉంచాలని, 14 రకాల పరీక్షలు చేయాలని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని గమనించి వారికి అవసరమైన మందులు ఇవ్వాలన్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ వైద్యశాలలకు సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యశాలలో అందుతున్న సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాలలో వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఆత్మ పీడీ అన్నపూర్ణ, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి, డీపీవో నారాయణరెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఉపేంద్ర, పౌరసరఫరాల సంస్థ డీఎం గ్లోరియా, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి గోపీచంద్, ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, పీహెచ్‌సీ వైద్యాధికారి బి.రత్నం, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖాధికారి ప్రసాదరావు, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, విజిలెన్స్ కమిటీ మెంబర్ అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

ఒంగోలు: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 10న పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ ముఖ్య కార్య నిర్వహణాధికారి బి.జాలిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఏడు రకాల స్థాయి సంఘాల సమావేశం జరుగుతుందన్నారు. సంబంధిత అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలన్నారు.

రేపు డీఎస్సీ 1998 ఉపాధ్యాయుల సమావేశం

ఒంగోలు: డీఎస్సీ 1998 ఉపాధ్యాయుల సమావేశం స్థానిక లంబాడీ డొంకలోని పాత శివాని స్కూలు ఆవరణలోని ఎస్ఆర్ విద్యాసంస్థలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు 1998 డీఎస్సీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.వీరయ్య, కార్యదర్శి మండవ సుబ్బారావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 1998 డీఎస్సీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు మోర్తాల బాలిరెడ్డి హాజరవుతారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇటీవల ఉద్యోగాలు పొందిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు తప్పక హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్లు 9948234516 లేదా 998285567లను సంప్రదించాలన్నారు.

జీజీహెచ్, వైద్య కళాశాల అభివృద్ధికి కృషి

- నాడు–నేడు కింద రూ.170 కోట్లతో ప్రతిపాదనలు
- వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు



సమీక్షిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలోని సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్), ప్రభుత్వ వైద్య కళాశాలలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు తెలిపారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయన.. జీజీహెచ్, మెడికల్ కాలేజీలో పలు విభాగాలను పరిశీలించారు. మెడికల్ కాలేజీలో అధికారులు, డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీలతో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ నాడు–నేడు కింద అభివృద్ధి పనులు చేపడతామని, అందుకోసం రూ.170 కోట్లతో పంపిన ప్రతిపాదనలు అందాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. జీజీహెచ్‌లో విభాగాల వారీగా అందుతున్న వైద్య సేవలు, వైద్య పరీక్షలకు సంబంధించిన పరికరాలు, వాటి పనితీరు, చిన్న పిల్లల వార్డుకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వం అంచనాలను చేరుకునేలా వైద్య శాఖ అధికారులు, డాక్టర్లు పని చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజు, ఆర్ఎంవో చైతన్య వర్మ, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, అన్ని విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృతంగా వర్షాలు



ఒంగోలు నగరంలో భారీగా కురిసిన వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

- ఒంగోలు నగరంలో కుండపోత

ఒంగోలు సబర్బన్: జిల్లాలో రెండు రోజుల నుంచి విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం 364.4 మి.మీ వర్షం కురిసింది. ఆ రోజు ఒంగోలు నగరంతో పాటు పశ్చిమ ప్రకాశంలోని బేస్తవారిపేట, దోర్నాల, కొమరోలు, హెచ్‌ఎంపాడు, మద్దిపూడి, తర్లుపాడు, కనిగిరి, పీసీ పల్లి, పామూరు, సీఎస్ పురంతో పాటు జిల్లా వ్యాప్తంగా మొత్తం మీద 25 మండలాల్లో వర్షం కురిసింది. మద్దిపూడిలో అత్యధికంగ 48.4 మి.మీ కురిసింది. శనివారం ఉదయం ఒంగోలు నగరంలో కుండ పోత వర్షం కురిసింది. దాదాపు ఒక గంట పాటు వర్షం ఆగకుండా కురవటంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఒంగోలు మండలంతో పాటు జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో కూడా ఒక మోస్తరు నుంచి భారీగా వర్షం దంచి కొట్టింది. మే నెల ప్రారంభంలోనే మొదటి రోజు జిల్లా మొత్తం కుండపోత వర్షం కురిసింది. ఆ రోజు జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజులోనే 1308.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లా మొత్తం సరాసరి వర్షపాతంలో 34.4 శాతం వర్షం ఒక్క రోజులోనే కురిసింది. ఆ రోజు అత్యధికంగా దర్శిలో 172.4 మి.మీ, త్రిపురాంతకంలో 130, పొదిలి 82.4, కొనకనమిట్లలో 69.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఆ రోజు పశ్చిమ ప్రకాశంలోని దాదాపు అన్ని మండలాల్లో వర్షం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మార్చి నెల ప్రారంభం నుంచే భానుడి తాపానికి జిల్లా ప్రజలు విలవిల్లాడుతూ అల్లాడిపోతూ వచ్చారు. ఏప్రిల్ నెలలో కూడా ఎండలు మంటలు మండాయి. అయితే నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడింది.